క్లుప్తంగా

న్యాయవాదుల నిరసన



నెల్లూరు (లీగల్): కోల్‌కతాలో ట్రెయినీ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ నగరంలోని కోర్టు ప్రాంగణంలో కొవ్వొత్తులతో ర్యాలీ, నిరసనను న్యాయవాదులు నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్, కమిటీ సభ్యుడు ప్రతాప్, మాజీ జాయింట్ సెక్రటరీ అన్వర్‌బాషా, న్యాయవాదులు జల్లి పద్మాకర్, రియాజ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం



నెల్లూరు(దర్గామిట్ట): అన్న క్యాంటీన్లకు రూ.లక్ష విరాళాన్ని హరనాథపురానికి చెందిన చీనిగ శ్రీనివాసులురెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరుల చేతుల బుధవారం అందజేశారు. టీడీపీ నేత ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యజమానులు నిబంధనలు పాటించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలో కల్యాణ మండపాలు నిర్వహిస్తున్న యజమానులు నిబంధనలు పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ వెంకటరమణబాబు సూచించారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం కల్యాణ మండపాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెళ్లిళ్లు, ఫంక్షన్ల సమయాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగిస్తున్నారన్నారు. ప్లాస్టిక్ నివారణతోపాటు చెత్త సేకరణకు అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. పార్కింగ్‌కు ప్రత్యేకంగా మండపంలోనే స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. రోడ్డు పక్కన ఉన్న కల్యాణ మండపాల వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రతిఒక్కరూ ప్రత్యేకంగా పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరాధనోత్సవాలు ప్రారంభం

మనుబోలు: మనుబోలు–చెర్లోపల్లి మార్గంలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా వెంకయ్యస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంధళ్ల శ్రీనివాసులు వెంకయ్యస్వామికి తొలుత పుణ్యాహవచనం, సహస్రనామార్చన, పంచామృతాభిషేకం చేసిన అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వెంకయ్యస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం నవగ్రహ శాంతి పూజ, కలశ ప్రతిష్ఠాపన, మహాగణపతి హోమం, శుక్రవారం అభిషేకాలు, శిఖరపూజ, పల్లకి సేవను నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

వ్యక్తిత్వ వికాసం ముఖ్యం

వెంకటాచలం: విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు సూచించారు. మండలంలోని కాకుటూరు వద్ద వీఎస్‌యూలో బుధవారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి వెళ్లేందుకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ ఈ రెండు అంశాలు చాలా ఉపయోగపడుతాయని తెలియజేశారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కళాశాలల్లో తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే విద్యార్థులకు చాలా ఉపయోగపడతాయన్నారు. అనంతరం సైకాలజిస్ట్ డాక్టర్ వి.సురేష్‌బాబు వ్యక్తిత్వ వికాసం గురించి కొన్ని మెళకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు

• మట్టి గణపయ్యలకే తొలి ప్రాధాన్యం



నెల్లూరు సిటీ: వినాయక చవితిని ఘనంగా జరుపుకొనేందుకు జిల్లా వాసులు సిద్ధమవుతున్నారు. పల్లెలు, పట్టణాల్లో ఉత్సవ కమిటీలు పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. పర్యావరణానికి హాని కలగని మట్టి గణపయ్యల ఏర్పాటుకే చాలా చోట్ల తొలి ప్రాధాన్యమిస్తున్నారు. కోల్‌కతా, రాజస్థాన్ నుంచి వచ్చిన కళాకారులు వినూత్న ఆకృతులతో గణనాథుడి విగ్రహాలను సిద్ధం చేసి, ఉత్సవ కమిటీల నిర్వాహకులను ఆకర్షిస్తున్నారు. ఎత్తు, ఆకృతిని బట్టి ధర నిర్ణయించి ఆర్డర్లు బుక్ చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు వేలకుపైగా మండపాలను ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరు నగరం, రూరల్, ఆత్మకూరు, కావలి, కందుకూరు, సర్వేపల్లి తదితర ప్రాంతాల్లో మండపాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

పదడుగుల విగ్రహం రూ.55 వేలు

ధరలు పెరిగినా ఏ మాత్రం తగ్గకుండా విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చేస్తున్నారు. రూ.ఐదు వేల నుంచి రూ.లక్ష వరకు విలువైన విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. సగటున రూ.25 వేల నుంచి రూ.55 వేల వరకు ధర ఉన్న విగ్రహాలకు ఎక్కువగా అడ్వాన్స్‌లు ఇచ్చి బుక్ చేస్తున్నారని సమాచారం. పదడుగుల గణనాథుడి విగ్రహం రూ.55 వేల వరకు పలుకుతోంది.





ఫ్లోరైడ్ నుంచి విముక్తి కల్పించాలని వినతి



జేసీకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): పొదలకూరు మండల పరిధిలోని పలు గ్రామాల దళిత ప్రజలను పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ వ్యాధి నివారణకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి సమస్య నుంచి శాశ్వత విముక్తి కల్పించాలని పలువురు కోరారు. ఈ మేరకు జేసీ కార్తీక్‌కు నగరంలోని ఆయన చాంబర్‌లో వినతిపత్రాన్ని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు కొప్పాల రఘు, దళిత నేత అరుణ కృపాకర్‌రావు, ఎస్సీ, ఎస్టీ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్, బహుజన సంఘ జిల్లా అధ్యక్షుడు శేషయ్య బుధవారం అందజేశారు. పొదలకూరు మండలం అంకుపల్లి సమీపంలోని కాలనీ, గిరిజన కాలనీల్లో 150 కుటుంబాల్లో 550 మందికిపైగా నివసిస్తున్నారని, ఫ్లోరైడ్ నీటిని తాగుతూ వ్యాధులకు గురవుతున్నారని చెప్పారు. మహిళా నేత జయప్రద, కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బాబు, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

200 పనిదినాలను కల్పించండి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 పనిదినాలను కల్పించేలా గ్రామసభల్లో తీర్మానం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పుల్లయ్య డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఉపాధి పథకం ద్వారా చేపట్టాల్సిన పనులు, పనిదినాలపై గ్రామసభలను శుక్రవారం నిర్వహించనున్నారని వివరించారు. గ్రామాల్లో దండోరా వేయించి జాబ్‌కార్డు ఉన్న ఉపాధి కూలీలు సభకు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు, ఉపాధ్యక్షుడు పెద్దబ్బయ్య తదితరులు, పాల్గొన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శైలేంద్రకుమార్

నెల్లూరు సిటీ: నగరంలోని రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, నోడల్ ఆఫీసర్లతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు.

టీబీ రహిత సమాజానికి కృషి



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): టీబీ రహిత సమాజానికి కృషి చేద్దామని ఏడీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ, ఎయిడ్స్ నివారణాధికారి ఖాదర్‌వలీ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రగతినగర్, టైలర్స్‌కాలనీ, ఆర్టీఏ కార్యాలయ సమీపంలో గల పట్టణ ఆరోగ్య కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. వయోజనులకు వేస్తున్న టీబీ నివారణ టీకాల పురోగతిని పరిశీలించారు. టీబీ పరీక్షలు, రోగులకు అందుతున్న మందులు, సేవలను తెలుసుకొని వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యతను తప్పక పరిశీలించాలి

• కమిషనర్ సూర్యతేజ



తాగునీటి సరఫరా వ్యవస్థను పరిశీలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యతను రోజూ పరిశీలించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లో జరుగుతున్న తాగునీటి సరఫరాను సంబంధిత అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ట్యాంక్ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి నమూనాల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చాణక్యపురి, రెవెన్యూ కాలనీ, పోలీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఎంహెచ్‌ఓ చైతన్య, డీఈ ప్రసాద్, ఏడీ హార్టికల్చర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లవేళలా అండగా ఉంటా..



పార్టీ నేతలతో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఎవరూ అధైర్యపడొద్దు.. మీకు అండగా ఉంటానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఒకటో, రెండో డివిజన్ల కార్పొరేటర్లు నాగరాజుగౌడ్, రామ్మోహన్‌యాదవ్ ఇళ్లకు బుధవారం వెళ్లి వారి యోగక్షేమాలను ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఏ చిన్న సమస్య వచ్చినా అందరూ ఐక్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. పార్టీ నాయకత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నేతలు లేబూరు పరమేశ్వరరెడ్డి, హరియాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, పాశం శ్రీనివాస్, ఆదిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం



నెల్లూరు(అర్బన్): నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ రెడ్‌క్రాస్, న్యూఢిల్లీ నుంచి వచ్చిన క్యాథరిన్ మేరీ మార్టిన్, జెనీవా, జాన్‌జార్జ్, మిస్‌రాణి విభూషిత బుధవారం సందర్శించారు. బ్లడ్ బ్యాంక్, స్పాస్టిక్స్ సెంటర్, తలసేమియా డే కేర్ సెంటర్, పొదలకూరురోడ్డులోని కేన్సర్ హాస్పిటల్, ఏఆర్వీ క్లినిక్, జనరిక్ మెడికల్ షాపు, ప్రకృతి వైపరీత్యాల కేంద్రాన్ని పరిశీలించారు. వీటి ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఆరాతీసి, రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ నేతలను అభినందించారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీడ్యూనాంట్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారిని సత్కరించారు. వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, ఎమ్సీ సభ్యులు రాజేంద్రప్రసాద్, ప్రసన్నాంజనేయులు, శ్రీహరిరెడ్డి, వాకాటి విజయకుమార్‌రెడ్డి, బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, ఏఆర్వీ సెంటర్ కన్వీనర్ వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ స్పాస్టిక్స్ సెంటర్‌లో పిల్లలకు అన్నదానాన్ని నిర్వహించారు. బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు తన జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం తన మిత్రబృందంతో కలిసి రక్తదానం చేశారు.

29న 5కే రన్

నెల్లూరు(అర్బన్): హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా నగరంలో 5కే రన్‌ను జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, స్పోర్ట్స్ అథారిటీ, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి నిర్వహించనున్న కార్యక్రమానికి 17 నుంచి 25 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులని చెప్పారు. ఆసక్తి గల వారు కళాశాల ఐడీతో అదే రోజు స్టేడియం వద్దకు హాజరుకావాలని కోరారు. దీనికి సంబంధించి ఈ నెల 27వ తేదీ సాయంత్రంలోపు వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారికి రూ.ఏడు వేలు, రూ.నాలుగు వేల చొప్పున అందజేయనున్నామని వివరించారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించనున్నారన్నారు.

భక్తిశ్రద్ధలతో మధ్యారాధన



నెల్లూరు(బృందావనం): మండపాలవీధిలోని గురురాఘవేంద్రస్వామి మఠంలో ఆరాధన మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మధ్యారాధనను పురస్కరించుకొని సహస్ర శంఖ క్షీరాభిషేకం, రాఘవేంద్రుడి అష్టోత్తర పారాయణాన్ని బుధవారం జరిపారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. భక్తిగీతాలాపన, గానకచేరిని రమాదేవి శిష్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. పల్లకి, ఊంజల్‌సేవలను చేపట్టారు. కంబాలూరు వ్యాస పీఠ ప్రతిష్ఠాన మేనేజర్ శ్రీధరాచార్య, వ్యాసరాజ మఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు, సింహపురి మధ్వ సంఘ అధ్యక్షుడు దేవరసు ప్రవీణ్, పత్రి గురురాజా, నందగిరి జనార్దన్‌రావు, వెంకటగురుచరణ్ పాల్గొన్నారు.

వ్యర్థాల డంపింగ్ వాహనానికి జరిమానా



వ్యర్థాలను వేస్తున్న వాహనం

నెల్లూరు(బారకాసు): బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను డంపింగ్ చేస్తున్న వాహనానికి నగరపాలక సంస్థ అధికారులు జరిమానా విధించారు. స్థానిక 30వ డివిజన్ రెవెన్యూకాలనీలో నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఆరోగ్యశాఖాధికారి చైతన్యతో కలిసి బుధవారం పరిశీలించారు. అక్కడ బహిరంగ ప్రదేశంలో వ్యర్థాలు డంప్ చేస్తున్న విషయాన్ని గుర్తించి వాటికి జరిమానా విధించాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో శానిటేషన్ అధికారులు బుధవారం సాయంత్రం స్థానికంగా వ్యర్థాలు వేస్తున్న ఒక వాహనాన్ని గుర్తించి రూ.5 వేల జరిమానా విధించారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు చేపడతామని అధికారులు వాహన యజమానిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు (టౌన్): ఎంబీఏ మూడో సెమిస్టర్ ఫలితాల్లో వర్సిటీ స్థాయిలో తొలి మూడు ర్యాంకులను సాధించిన నగరంలోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రమోద్‌రాణా బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సాయి హర్షిత 693, సుష్మా, లతీఫా 692, సూర్యతేజ 689 మార్కులను సాధించారని వివరించారు. డీన్ మల్లికార్జునయ్య, అడ్మిన్ జ్యోతి, ప్రిన్సిపల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



నెల్లూరు(అర్బన్): ఓ మహిళ మోకాలి పైభాగంలో ఉన్న ఐదు కిలోల కణితిని శస్త్రచికిత్స ద్వారా నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో బుధవారం తొలగించారు. వివరాలు.. చేజర్లకు చెందిన 62 ఏళ్ల రమణమ్మ కుడితొడపై 20 ఏళ్ల క్రితం ఏర్పడిన కణితి క్రమేపీ పెరగడంతో కొంత కాలంగా వివిధ ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించారు. గడ్డ పెద్దగా ఉండటం, రక్తనాళాలకు అతుక్కొని ఉంటుందనే కారణంతో ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ ద్వారా చేసేందుకు ఎవరూ ముందుకురాలేదు. దీంతో ప్రభుత్వ పెద్దాస్పత్రికి రెండు రోజుల క్రితం ఆమె వచ్చారు. అన్ని పరీక్షలను అసోసియేట్ ప్రొఫెసర్ కాలేషాబాషా, డాక్టర్లు సుహాసిని, ఉమామహేష్ నిర్వహించారు. వీరందరూ సర్జరీని విజయవంతంగా చేసి కుడి తొడపై ఉన్న కణితిని తొలగించారు. ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్లను సూపరింటెండెంట్ సిద్ధానాయక్ అభినందించారు.

14 మంది ఎస్సైల బదిలీ

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రాంతం
తిరుపతయ్య	వరికుంటపాడు	వీఆర్, నెల్లూరు
కిశోర్‌బాబు	కందలేరు	అల్లూరు
శ్రీనివాసులురెడ్డి	అల్లూరు	వీఆర్, నెల్లూరు
క్రాంతికుమార్	డీసీఆర్బీ	సైదాపురం
విజయకుమార్	సైదాపురం	వీఆర్, నెల్లూరు
అంకమ్మ	వీఆర్, నెల్లూరు	ఉలవపాడు
బాజిరెడ్డి	ఉలవపాడు	వీఆర్, నెల్లూరు
శివనాంచారయ్య	కృష్ణపట్నం పోర్టు	వీఆర్, నెల్లూరు
జిలానీ	వీఆర్, నెల్లూరు	ఆత్మకూరు
ముత్యాలరావు	ఆత్మకూరు	వీఆర్, నెల్లూరు
లతీఫున్నీసా	చిన్నబజార్	జలదంకి
ఆదిలక్ష్మి	జలదంకి	వీఆర్, నెల్లూరు
స్వప్న	నెల్లూరు రూరల్	నవాబుపేట
మహేంద్ర	కొండాపురం	డీసీఆర్బీ

జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన 14 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులను బుధవారం రాత్రి జారీ చేశారు. వీరు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. –నెల్లూరు(క్రైమ్)

జెడ్పీలో పలువురికి ఉద్యోగోన్నతులు

నెల్లూరు(దర్గామిట్ట): జెడ్పీ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులను కల్పించి పోస్టింగ్‌లను ఇచ్చారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో వీరికి పోస్టింగ్ ఉత్తర్వులను చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ కన్నమనాయుడు బుధవారం అందజేశారు. కాగా ఉద్యోగోన్నతులను కల్పించినందుకు గానూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్కాకుల పెంచలయ్య, నాలుగో తరగతి ఉద్యోగ సంఘ నేతలు భీమ్‌రెడ్డి, మాబాషా, అనిల్‌కుమార్ కృతజ్ఞతలను తెలియజేశారు.

ఆదిశంకర ధ్యాన మందిరంలో పూజలు నేడు

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిర వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలను గురువారం నిర్వహించనున్నామని మందిర మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

ఘన సన్మానం

నెల్లూరు(బారకాసు): బీజేపీ అభివృద్ధి కోసం తమ చివరి క్షణం వరకు శ్రమించి మరణించిన నేతల కుటుంబసభ్యులను పార్టీ మూలాపేట మండల శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. తాంద్ర రమణయ్య కుమార్తె సరోజ.. నెల్లూరు సుధాకర్ సతీమణి సరస్వతి.. రాయవెంకటేశ్వరరావు సతీమణి పద్మావతమ్మను పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరమ్మ సన్మానించారు. మిడతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.